దర్గాగా..
శిఖం భూమి కబ్జా..



2





2

పశువుల కొట్టంలోకి
దూసుకెళ్లిన కారు



AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in


## ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్‌గా శ్రీహరి రాజు బాధ్యతల స్వీకరణ



**అక్షరటుడే ఆర్మూర్ :** ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్‌గా శ్రీహరి రాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఉమామహేశ్వరరావు బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే. ఉమామహేశ్వర్‌రావు స్థానంలో బాన్సువాడ మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజును ప్రభుత్వం ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్‌గా నియమించింది. దీంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ముందుగా మున్సిపల్ ఉద్యోగులు నూతన కమిషనర్‌కు స్వాగతం పలికారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.



## బ్యాంకులు, నగల దుకాణాల్లో భద్రత కట్టుదిట్టం చేసుకోవాలి



**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో బ్యాంకులు, నగల దుకాణాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేసుకోవాలని సీపీ సాయి చైతన్య పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయంలో బ్యాంకు అధికారులు, జ్యువెలరీ వ్యాపారస్థులు, బంగారు వెండి వర్తక సంఘాల ప్రతినిధులతో సోమవారం సమావేశం నిర్వహించారు. జిల్లాకు 44వ జాతీయ రహదారి దగ్గరగా ఉండడం.. మహారాష్ట్ర సరిహద్దుగా ఉన్నందున అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. సీసీ కెమెరాలు, అలారం, సెక్యూరిటీ గార్డుల వ్యవస్థను ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలని సూచించారు. ఆయా వ్యాపార సంస్థల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏసీపీ ప్రకాష్, నిజామాబాద్ టౌన్ సీఐ శ్రీనివాసరాజ్, వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి, నిజామాబాద్ రూరల్ సీఐ సతీష్ కుమార్, సీసీఆర్బీ సీఐ అంజయ్య, లీడ్ బ్యాంక్ మేనేజర్ సునీల్‌కుమార్, నిజామాబాద్ గోల్డ్ అండ్ సిల్వర్ మర్చంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లక్ష్మీకాంత్, గోల్డ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎండీ యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.



## వ్యవసాయ కళాశాలను జక్రాన్‌పల్లిలోనే ఏర్పాటు చేయాలి

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** వ్యవసాయ కళాశాలను జక్రాన్‌పల్లి మండలంలో ఏర్పాటు చేయాలని సర్పంచ్‌ల ఫోరం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు వారు ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫోరం ప్రతినిధులు మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్‌కు అనుబంధంగా నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ వ్యవసాయ కళాశాలను మంజూరు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. అయితే జక్రాన్‌పల్లిలో 800 ఎకరాలకు పైగా సారవంతమైన ఎర్ర నేల, భూగర్భ జలాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. జాతీయ రహదారికి అతి సమీపంలో కళాశాల ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ స్థలం ఉందని వారు వివరించారు. వ్యవసాయ కళాశాలను ఇక్కడ ఏర్పాటు చేస్తే చుట్టుపక్కల గ్రామాల ప్రజలందరికీ ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం ప్రతినిధులు పాల్గొన్నారు.

కామారెడ్డి మున్సిపాలిటీ వివాదాలకు కేంద్ర బిందువుగా మారుతోంది. కొత్తగా ఏర్పాటైన పాలకవర్గంతో అధికారులకు సఖ్యత కొరవడడంతో ఇబ్బందిగా మారింది. ఏకంగా మున్సిపల్ కమిషనర్‌ను సరెండర్ చేయాల్సిందేనని కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం చేయడమే ఇందుకు నిదర్శనం. తాజాగా కొత్త కమిషనర్ బాధ్యతలు చేపట్టారు. దీంతో పాలన గాడిన పడేనా అనే చర్చ సాగుతోంది.

- అక్షరటుడే, కామారెడ్డి




# పాలన గాడిన పడేనా..!

- కామారెడ్డి మున్సిపాలిటీలో రాజకీయ రగడ
- గత కమిషనర్‌ను సరెండర్ చేసిన కౌన్సిల్
- బాధ్యతలు చేపట్టిన కొత్త కమిషనర్

కామారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా పర్వతాలు సోమవారం బాధ్యతలు చేపట్టారు. అయితే నూతన కమిషనర్‌తో పాలకవర్గం ఏ మేరకు సఖ్యత కొనసాగిస్తుందోనన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అధికారులు, పాలకవర్గ సభ్యుల సమష్టి కృషితో మున్సిపాలిటీ అభివృద్ధి దిశగా ముందుకు సాగేనా.. అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

### ముఖ్య అధికారులు లేక

గతంలో కమిషనర్‌గా కొనసాగిన రాజేందర్ రెడ్డిని పాలకవర్గ సభ్యులు టార్గెట్ చేశారు. ఆయన పనులు సరిగా చేయడం లేదని ఆరోపిస్తూ కౌన్సిల్ మొత్తం ఏకగ్రీవంగా సరెండర్ తీర్మానం చేసి కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. అలాగే టీపీవోను సైతం సరెండర్ చేయాలని తీర్మానం చేశారు. దీంతో ఆయన దీర్ఘకాలిక సెలవుపై వెళ్లి కామారెడ్డి బాధ్యతల నుంచి తప్పుకున్నారు. ప్రస్తుతం ఆయన పర్మనెంట్ పోస్టింగ్ ఉన్న దుబ్బాక టీపీవోగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం టీపీఎస్ సైతం వ్యక్తిగత సెలవులో ఉన్నారు. ఆమె రావడానికి సమయం పట్టే అవకాశాలు ఉన్నాయి. అలాగే సానిటరీ ఇన్‌స్పెక్టర్ సెలవులో ఉన్నారు. ఆ బాధ్యతలను మున్సిపల్ మేనేజర్ చూస్తున్నారు. ముఖ్య అధికారులు సరెండర్, సెలవుల్లో ఉండటంతో పాలన పడకేసింది.

### సమన్వయం కుదిరేనా..

కామారెడ్డి మున్సిపల్ పాలకవర్గం ఏర్పడి మూడు నెలల కావస్తోంది. మూడు నెలల్లోనే పాలకవర్గం తీరు చర్చనీయాంశంగా మారింది. కౌన్సిల్ సభ్యులకు, అధికారుల మధ్య సమన్వయం కొరవడటంతో కౌన్సిల్ సభ్యులు ప్రతి సమావేశంలో అధికారులపై గుస్సా అయ్యారు. మున్సిపాలిటీలో ముఖ్యమైన శాఖల అధికారులు లేకపోవడంతో కొత్తగా వచ్చిన మున్సిపల్ కమిషనర్ పై ప్రస్తుతం బాధ్యత పెరిగింది. ఈ నేపథ్యంలో కమిషనర్‌కు కౌన్సిల్ సభ్యులకు మధ్యన సఖ్యత కొనసాగుతుందా.. లేదా గతంలో మాదిరిగా వివాదాలు చోటు చేసుకుంటాయా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

### కొత్త కమిషనర్‌కు సవాళ్లు

కామారెడ్డి మున్సిపాలిటీ పరిపాలన కొత్తగా వచ్చిన కమిషనర్‌కు సవాల్ గా మారనుందని చెప్పవచ్చు. టీపీవో, టీపీఎస్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ సెలవులో ఉండటంతో ఆ శాఖల పనితీరుపై కమిషనర్ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ముఖ్యమైన శాఖలు కావడంతో పాటు, ఆయ శాఖల అధికారులపై అనేక ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో అధికారులు, పాలకవర్గ సభ్యులను సమన్వయం చేసుకొని కమిషనర్ ఎలా ముందుకు వెళ్తారో చూడాలి.

## కామారెడ్డి, ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్ల బాధ్యతల స్వీకరణ



**అక్షరటుడే, కామారెడ్డి/ఎల్లారెడ్డి:** జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి మున్సిపాలిటీలకు నూతన కమిషనర్లను ప్రభుత్వం నియమించింది. కామారెడ్డి కమిషనర్ గా జీహెచ్ఎంసీలో శంషాబాద్ ఏఎంసీగా విధులు నిర్వహించిన టి.పర్వతాలును బదిలీ చేసింది. దీంతో ఆయన సోమవారం కామారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. కామారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన రాజేందర్ రెడ్డి పనితీరుపై కౌన్సిల్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయనను మున్సిపల్ శాఖకు సరెండర్ చేయాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. దాంతో నొచ్చుకున్న ఆయన సెలవుపై వెళ్లగా ఆయనను మున్సిపల్ శాఖ కు సరెండర్ చేశారు. అలాగే నారాయణఖేడ్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసి బదిలీపై ఎల్లారెడ్డికి వచ్చిన జగ్జీవన్ ఎల్లారెడ్డి మున్సిపాలిటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఇద్దరు కమిషనర్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.

## కామారెడ్డి డీఎస్పీగా మధుసూదన్ బాధ్యతల స్వీకరణ



**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి డీఎస్పీగా మధుసూదన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద్ ఇంటలిజెన్స్ విభాగంలో డీఎస్పీగా పనిచేసిన ఆయన కామారెడ్డికి బదిలీపై వచ్చారు. మధుసూదన్ గతంలో కామారెడ్డి పట్టణ సీఐగా పనిచేశారు. ఇక్కడ కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ హోదాలో పనిచేసిన చైతన్య రెడ్డి సంగారెడ్డి అడిషనల్ ఎస్పీగా పదోన్నతిపై వెళ్లిన విషయం తెలిసిందే. ఆమె స్థానంలో ఏఎస్పీ క్యాడర్‌లో కొత్తవారు వస్తారని అందరూ భావించారు. అయితే అనుకోకుండా డీఎస్పీ హోదాలోనే మధుసూదన్‌ను ప్రభుత్వం నియమించింది. దీంతో సోమవారం బాధ్యతలు చేపట్టిన ఆయన జిల్లా ఎస్పీ రాజేష్ చంద్రను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. బాధ్యతలు తీసుకున్న డీఎస్పీని డివిజన్‌లోని పలువురు సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సీఎం ముందుకురావడం హర్షణీయం

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించడం హర్షణీయమని టీజీఈజేఏసీ జిల్లా చైర్మన్ నాశెట్టి సుమన్ కుమార్ పేర్కొన్నారు. నగరంలోని టీఎన్జీవోస్ భవన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీజీఈజేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్, జనరల్ సెక్రెటరీ ఏలూరి శ్రీనివాస్ ఆదేశానుసారం 5వ తేదీన నిర్వహించాలనుకున్న ఒకరోజు నిరాహార దీక్షను విరమించుకుంటున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో రాష్ట్ర కమిటీ నిర్ణయాల మేరకు ముందుకు వెళ్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి నేతికుంట శేఖర్ తదితరులు పాల్గొన్నారు.




## శాంతి భద్రతల పరిరక్షణకు కృషి: సీఐ జగడం నరేష్

**అక్షరటుడే, కామారెడ్డి:** శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని సీఐ జగడం నరేష్ అన్నారు. భిక్కనూరు పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన సీఐ సంపత్ కుమార్‌ను ఐజీ కార్యాలయానికి అటాచ్ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయనకు పోస్టింగ్ ఇవ్వలేదు. బాధ్యతలు చేపట్టిన సీఐ నరేష్‌ను పలువురు ఎస్సైలు, పోలీసు సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. శాంతిభద్రతల విషయంలో ప్రజలతో కలిసి ముందుకు సాగుతామన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. కామారెడ్డి జిల్లాలో జగడం నరేష్‌కు పనిచేసిన అనుభవం ఉంది. సదాశివనగర్ ఎస్సైగా, బిచ్కుంద సీఐగా విధులు నిర్వర్తించారు.

## విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకుసాగాలి : కలెక్టర్ ఇలా త్రిపాఠి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో సిరికొండ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఈ సందర్భంగా వారు ప్రజావాణిలో కలెక్టర్‌ను కలవగా.. అభినందించారు. పదో తరగతి ఫలితాల్లో 550కి పైగా మార్కులు సాధించి పాఠశాలకు మంచి పేరు తెచ్చిన విద్యార్థులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో ఏం అవ్వాలనుకుంటున్నారంటూ కలెక్టర్ వారిని అడిగి తెలుసుకున్నారు. రాబోయే రోజుల్లో అధ్యాపకుల సలహాలు సూచనలు పాటిస్తూ బాగా చదువుకుని ఉత్తమ స్థానాల్లో నిలవాలని సూచించారు. 107 ప్రభుత్వ పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించడంపై కలెక్టర్ డీఈవో అశోక్‌ను అభినందించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, జడ్పీహెచ్ఎస్ సిరికొండ గెజిటెడ్ హెచ్ఎం సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.





## నగరంలో బీజేపీ విజయోత్సవ ర్యాలీ.. సంబరాలు

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయకేతనం ఎగురవేసింది. ఈ సందర్భంగా నగరంలో బీజేపీ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ, సంబరాలు నిర్వహించారు. నగరంలోని నిఖిల్ సాయి చౌరస్తా వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. రంగులు చల్లుకుని.. పటాకులు కాల్చారు. అనంతరం ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్ ప్రజలు మార్పు కోరుకున్నారని, మమతా బెనర్జీ అరాచక పాలన నుంచి విముక్తి పొందేందుకు బీజేపీని గెలిపించారన్నారు. బెంగాల్‌లో బీజేపీ చరిత్ర సృష్టించిందన్నారు. ఈ ఎన్నికల ద్వారా ప్రజలు అభివృద్ధి, పారదర్శకత, భద్రతను కోరుకుంటున్నారని మరోసారి నిరూపించారన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు గోపిడి స్రవంతి రెడ్డి, పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, నాగోళ్ల లక్ష్మీ నారాయణ, ప్రమోద్ కుమార్, జ్యోతి, బద్దం కిషన్, బొబ్బిలి వేణు, ఇందూర్ సుధా, ఇప్పాకాయల కిషోర్, పద్మారెడ్డి, నాయిడి రాజన్న, పవన్, ఆనంద్ రావు, చిరంజీవి, బంటు ప్రవీణ్, ఆనంద్ విజయ్ కృష్ణ, చీకోటి రవి, అన్నం గోపి, మల్కాయి మహేందర్, పుట్ట వీరేందర్ పాల్గొన్నారు.

## చిరు వ్యాపారులకు అండగా ఉంటా: కేవీఆర్

**అక్షరటుడే, కామారెడ్డి:** అగ్ని ప్రమాదం లో దుకాణాలను కోల్పోయిన బాధిత చిరు వ్యాపారులకు అండగా ఉంటానని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి భరోసా కల్పించారు. పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని ఇందిరా చౌక్ వద్ద అగ్నిప్రమాదంలో కాలిపోయిన దుకాణాలను కౌన్సిలర్లతో కలిసి సోమవారం పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరుపై వ్యాపారస్తులను అడిగి ఎమ్మెల్యే తెలుసుకున్నారు. బాధితులు అధైర్యపడవద్దని, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల దుకాణాలు కాలిపోవడం దురదృష్టకరమని, వ్యాపారస్థులు వ్యాపార సామాగ్రితో పాటు దుకాణం నిర్మాణం మొత్తం నష్టపోయారన్నారు. 22 దుకాణదారుల పూర్తి సమాచారం తనకు ఇవ్వాలని, సాధ్యమైనంత త్వరగా ప్రభుత్వం తరపున పునర్నిర్మాణం చేపట్టడానికి ప్రయత్నం చేస్తానని తెలిపారు. ఆలోపు కాలిపోయిన వస్తువులన్నింటినీ తీసేసి స్థలం చదును చేయాలని సూచించారు. బాధితులు నష్టపోయిన మొత్తంలో ప్రభుత్వం తరపున రావాల్సిన పరిహారం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



## ఎల్లారెడ్డి డివిజన్ ప్రజావాణికి పది ఫిర్యాదులు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి రెవెన్యూ డివిజన్‌లోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఆర్డీవో ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వివిధ శాఖల డివిజనల్ స్థాయి అధికారులు పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖకు సంబంధించి నాలుగు అర్జీలు, మున్సిపల్ శాఖకు సంబంధించి మూడు, విద్యుత్ శాఖకు సంబంధించి ఒక ఫిర్యాదు, పంచాయతీరాజ్ శాఖపై రెండు ఫిర్యాదులు అందాయి. అర్జీలను ఆయా శాఖల అధికారులకు పంపించి, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆర్డీవో ప్రభాకర్ ఆదేశించారు. ప్రతి సోమవారం జరిగే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## సీపీవోలుగా ఉపాధ్యాయులను నియమించడం సమంజసం కాదు

**అక్షరటుడే, కామారెడ్డి:** రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సీపీవోలుగా ప్రభుత్వ ఉపాధ్యాయులను నియమించడం సమంజసం కాదని స్వాన్ ఇండియా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పీబీ సత్యం అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న అన్ని ఉన్నత పాఠశాలలకు సీపీవోలను నియమించడానికి ప్రభుత్వం ముందుకు రావడం సంతోషకరమన్నారు. అయితే ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వివిధ సబ్జెక్టులు బోధిస్తున్న ఉపాధ్యాయులలో ఒకరిని ఎంపిక చేసుకుని వారికి న్యాయసేవ సంస్థ ద్వారా చట్టాలపై శిక్షణనిచ్చి.. రాష్ట్రంలోని 5,711 పాఠశాలల్లో సీపీవోలుగా నియమించడం ఎంతవరకు సమంజసమో అర్థం కావడం లేదన్నారు. ఇలా నియమించడం వల్ల.. ఉపాధ్యాయులపై పనిభారంతో పాటు తీవ్రమైన ఒత్తిడి పడుతుందన్నారు. కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా స్వాన్ ఇండియా అధికార ప్రతినిధులు శ్రీనివాస్, విజయ్ పాల్గొన్నారు.



# దర్గాగా శిఖం కబ్జా..

■ సాంపల్లి చెరువు దురాక్రమణ ■ మాటుకాలువ సైతం మాయం చేశారని ఆరోపణలు ■ స్పందించని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు

**జిల్లాలో అనేక చోట్ల జల వనరులు ఆక్రమణకు గురవుతున్నాయి. క్రమంగా వాటి రూపురేఖలు మారిపోతున్నాయి. సాగు నీటితోపాటు భూగర్భ జలాల వృద్ధికి దోహదపడే చెరువులు, కుంటలు కూచించుపోతున్న పరిస్థితి నెలకొంది. యథేచ్ఛగా చెరువులు కబ్జా చేస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది.**

**– అక్షరటుడే, డిచ్‌పల్లి**

డిచ్‌పల్లి మండలం సాంపల్లి సామ్ చెరువు కొన్నేళ్లుగా ఆక్రమణకు గురవుతోంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో చెరువు రోజురోజుకూ కుచించుకుపోతోంది. మండలంలోని సాంపల్లి చెరువు 334 సర్వే నంబరులో 42.0900 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇందులో ఒక వైపు చాలా మేరకు శిఖం భూమి కబ్జాకు గురైందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### దర్గాగా దున్నేసినా..

సాంపల్లి చెరువు శిఖం భూమి యథేచ్ఛగా కబ్జా అవుతోంది. గతంలో నీరు ఇంకినప్పుడు ఉపాధిహామీ పథకంలో మొక్కలను నాటించారు. అయితే కొందరు దౌర్జన్యంగా మొక్కలను దున్నేసి ఆ శిఖం భూమిలో పంటలు సాగుచేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో మిషన్ కాకతీయ కింద చెరువు పునరుద్ధరణ పనులు చేపట్టినప్పటికీ చుట్టూ కందకం తీయకపోవడంతో శిఖం భూమి కబ్జా పెరిగిపోతోంది. ఇరిగేషన్, రెవెన్యూ అధి కారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వెలువెత్తుతు న్నాయి. శిఖం ఆక్రమణతో భూగర్భ జలాలు తగ్గిపోతు న్నాయని చెరువు చుట్టూ భూములున్న సాంపల్లి, సాంపల్లి తండా, గుడి తండా, మేల్యా తండాల రైతులు ఆవేదన చెందుతున్నారు. చెరువు పూర్తి విస్తీర్ణాన్ని సర్వేచేసి శిఖం భూమిని కాపాడాలని కోరుతున్నారు.

### అలుగు కాలువను సైతం..

చెరువు అలుగు పారే కాలువను ఇటీవల ఓ ప్రజాప్రతినిధి కబ్జా చేస్తున్నట్లుగా సోషల్‌మీడియాలో వైరల్ అయినప్పటికీ సంబంధిత ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అలాగే వర్షాకాలంలో అటవీప్రాంతం నుంచి చెరువు వచ్చే మాటు కాలువ సైతం ప్రస్తు తం కనిపించకుండా పోయిందని.. కొందరు కాలువలో పెద్దపైపులు వేసి కాలువను చిన్నదిగా చేసేశారని ఆరోపి స్తున్నారు. దీంతో వర్షాకాలంలో అటవీ ప్రాంతం నుంచి నీరు సక్రమంగా రాకపోవడంతో చెరువు సకాలంలో నిండడం లేదని స్థానికులు వాపోతున్నా రు. ఇకనైనా అధికారులు స్పందించాలని సాంపల్లి, సాంపల్లి తండా, గుడి తండా, మేల్యా తండా వాసులు కోరారు.

## బాన్సువాడలో రైతు వారోత్సవాలు




**అక్షరటుడే, బాన్సువాడ:** మండలంలోని తాడ్కోల్ లోని రైతు వేదికలో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రైతు వారోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. మట్టి నమూనాలను సేకరించే సరైన విధానం, పంటలకు అవసరమైన ఎరువుల మోతాదు, వానాకాలంలో సాగు చేయదగిన పంటల రకాలు, సేంద్రియ వ్యవసాయం ప్రాముఖ్యత వంటి విషయాలను వివరించారు. అలాగే వర్షాకాలంలో వేసుకోవాల్సిన వరి విత్తనాలు, వివిధ రకాల వరి ధాన్యాల గురించి రైతులకు సమగ్ర సమాచారం అందించారు. కార్యక్రమంలో తాడ్కోల్ సర్పంచ్‌లు రమేష్, మన్నె రమేష్, ఖాత్రోత్ పూజార, ఏఈవో రాణి, రైతులు పాల్గొన్నారు.

## బాల్కొండలో ఘనంగా రైతు వారోత్సవాలు



**అక్షరటుడే, బాల్కొండ:** మండలంలోని బాల్కొండ, వన్నెల్ రైతు వేదికల్లో సోమవారం రైతు వారోత్సవాలు ప్రారంభించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమాలు జరిగాయి. బాల్కొండలో డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకురాలు లావణ్య రైతులను ఉద్దేశించి మాట్లాడారు. మట్టి నమూనాల సేకరణ విధానం, నేల ఆరోగ్యం, సమీకృత ఎరువుల వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే వినియోగదారులు ఇష్టపడే వరి రకాలు, నానో ద్రవరూప ఎరువుల అవసరం గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వినోదా భూమేశ్వర్, ఏఈవోలు నిహారిక, రేష్మ, రైతులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 103 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డీఆర్డీవో సాయన్న, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాస్‌లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా.. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సబ్ కలెక్టర్, ఆర్డీవోల నేతృత్వంలో డివిజన్ స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత డివిజన్ పరిధిలోని తహశీల్దార్లు పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బాధితులను ఆదుకుంటాం: టీపీసీసీ జనరల్ సెక్రెటరీ

**అక్షరటుడే, కామారెడ్డి:** పట్టణంలోని ఇందిరాచౌక్ వద్ద అగ్నిప్రమాదంలో కాలిపోయిన దుకాణాలను టీపీసీసీ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి పరిశీలించారు. బాధితులతో మాట్లాడి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అగ్ని ప్రమాద బాధితులకు గడ్డం చంద్రశేఖర్ రెడ్డి ఆర్థికసాయం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జరిగిన ఘటన చాలా బాధాకరమని, ప్రమాదంలో దాదాపు రూ.కోటి నష్టం జరిగిందన్నారు. వెంటనే జిల్లా ఎస్పీ, పోలీస్ యంత్రాంగం, ఆర్డీవో, రెవెన్యూ అధికారులు జరిగిన ప్రమాదంపై ఆరా తీయాలని కోరారు. అలాగే కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణా రెడ్డి సైతం బాధితులను పరామర్శించిన విషయం తెలిసిందే. వీలైనంత త్వరగా బాధితులను ఆదుకోవాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట మున్సిపల్ కౌన్సిలర్ గడ్డమీది మహేష్, డీసీసీ ప్రధాన కార్యదర్శి జూలూరి సుధాకర్, మాజీ కౌన్సిలర్లు చాట్ల వంశీ, సలీం, జమీల్, రంగ రమేష్, గంగుల్ రెడ్డి, రాజశేఖర్, నిరంజన్, కోటి, శశి, రాహుల్ ఉన్నారు.



## ధాన్యం కొనుగోలు కేంద్రానికి వెళ్లే దారిని తవ్వేశారు..



**అక్షరటుడే, లింగంపేట:** రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లే దారిని ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తవ్వేశారు. లింగంపేట మండలం మాలపాటి గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ సందర్భంగా మాలపాటి గ్రామస్థులు మాట్లాడుతూ.. గ్రామ సమీపంలోని ధాన్యం కొనుగోలు కేంద్రానికి వెళ్లే రోడ్డును ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు తవ్వేశారన్నారు. దీంతో కొనుగోలు కేంద్రాలకు లారీలు వెళ్లే అవకాశం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. లింగంపేట మండలంలోని పెద్దవాగు నుంచి శెట్‌పల్లి సంగారెడ్డికి చెందిన కొందరు వ్యక్తులు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని గ్రామస్థులు తెలిపారు. అయితే వారు నేరుగా కాకుండా మాలపాటి గ్రామ రైతుల పొలాల నుంచి ఇసుకను తరలిస్తుండేవారన్నారు. రెండు రోజుల క్రితం శెట్‌పల్లి సంగారెడ్డి గ్రామానికి చెందిన మూడు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని సీజ్ చేశారని.. దీంతో ఆగ్రహించిన ఇసుక మాఫియా ఈ పనికి ఒడిగట్టిందని గ్రామస్థులు ఆరోపించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై దీపక్‌కుమార్ దర్యాప్తు చేస్తామని హామీ ఇచ్చారని వారు తెలిపారు.

## పశువుల కొట్టంలోకి దూసుకెళ్లిన కారు.. ఇద్దరి పరిస్థితి సీరియస్



**అక్షరటుడే, కామారెడ్డి:** పెళ్లితంతు ముగించుకుని వెళ్తున్న కారు.. అదుపుతప్పి పశువుల కొట్టంలోకి దూసుకెళ్లింది. ఈ ఘటన రామారెడ్డి మండలం ఉప్పల్‌వాయి గ్రామంలో సోమవారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గాంధారికి చెందిన అమ్మాయికి మాచారెడ్డి మండలం సోమార్‌పేట గ్రామానికి చెందిన అబ్బాయితో అదే గ్రామంలో ఆదివారం వివాహం జరిగింది. వివాహ తంతు పూర్తి చేసుకున్న కుటుంబ సభ్యులు ఎనిమిది మంది ఓ కారులో రామారెడ్డి, ఉప్పల్‌వాయి మీదుగా ఆదివారం అర్ధరాత్రి తర్వాత గాంధారికి బయలుదేరారు. సోమవారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో రామారెడ్డి మండలం ఉప్పల్‌వాయి గ్రామం వద్దకు చేరుకోగానే కారు అదుపుతప్పి కొట్టంలోకి దూసుకెళ్లింది. వేగంగా ఉన్న కారు కొట్టంలోని గేదెలను బలంగా ఢీకొనడంతో బోల్తాపడింది. ప్రమాదంలో మూడు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరొక గేదెకు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే కారులో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వెంటనే కామారెడ్డి జీజీహెచ్‌కు తరలించారు. అందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కలెక్టరేట్‌లో కలకలం.. మహిళ ఆత్మహత్యాయత్నం..



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** నిజామాబాద్ కలెక్టరేట్ ఆవరణలో ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేయడం కలకలం రేపింది. తమ కుటుంబాన్ని కుల బహిష్కరణ చేశారని.. ఇప్పటికే ముగ్గురు కలెక్టర్లకు విన్నవించినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్త చేసింది. దీంతో మనస్థాపానికి గురైన సదరు మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ సందర్భంగా ఆలూరు మండలం టేకంపల్లికి చెందిన మహిళ చిన్మల నల్లా మాట్లాడుతూ.. ఎస్సీ కులానికి చెందిన మాతో కొన్నేళ్ల క్రితం మా ఇంటి పక్కనే ఉన్నవారు అనవసరంగా గొడవ పెట్టుకున్నారన్నారు. ఈ గొడవలో మాదే తప్పుగా భావించిన కులం సభ్యులు మమ్మల్ని కులం నుంచి బహిష్కరించారని పేర్కొన్నారు. అప్పటినుంచి తమను కుల సమావేశాలకు రానివ్వట్లేదని.. ఏ కార్యానికి పిలవట్లేదని వాపోయింది. ఈ విషయమై మాక్లూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చామని తెలిపింది. అయితే ఫిర్యాదు ఇచ్చినా మాపైనే తిరిగి కేసు పెట్టిన పోలీసులు కోర్టుకు పంపారని ఆవేదన వ్యక్తం చేసింది. ఎన్నోసార్లు కలెక్టర్ ఆఫీసుకు వచ్చామని.. ఇప్పటికే ముగ్గురు కలెక్టర్లకు ఫిర్యాదు చేశామని అయినా ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. ఈ క్రమంలో ఆమె సోమవారం కలెక్టరేట్‌కు వచ్చిన ఆమె పురుగుల మందు తాగేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.

## గోశాలలో అగ్ని ప్రమాదం

**అక్షరటుడే మాక్లూర్:** మండలంలోని గాలిబ్ నగర్ సమీపంలో ఉన్న శ్రీమన్నారాయణ గోశాలలో సోమవారం అగ్ని ప్రమాదం జరిగింది. అనుకోకుండా చెలరేగిన మంటలు గోశాలలోకి వ్యాపించాయి. దీంతో గోశాలలో ఉన్న వరి గడ్డి కట్టలకు అంటుకున్నాయి. స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పారు. అయినప్పటికీ గడ్డికట్టలు కాలిపోయాయి.

